సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 9 । మే । 2024



విజ్ఞానం ఉద్యోగం కోసమే కాదు..
వ్యవసాయ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని ఉద్యోగాలతోనే సరిపెట్టుకోవద్దని డీన్ ఆఫ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సీమ అన్నారు. IIలో



పోలీసుల ఫ్లాగ్‌మార్చ్
ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు పాల్వంచలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. IIలో

గరిష్టం / కనిష్టం
37° / 26°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

ఇక పల్లెబాట..



మణుగూరు మండలం రామానుజవరంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపించింది. స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం దాదాపు ముగిసినట్టే. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు, కేడర్ పల్లెబాట పట్టాయి. ప్రతీ ఇంటికి తిరుగుతూ తమ పార్టీ గుర్తుపైనే ఓటెయ్యాలని కోరుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ముగిసిన స్టార్ క్యాంపెయినర్ల సందడి

- బూత్‌ల వారీగా ఇంటింటి ప్రచారం
- బ్యాలెట్ పేపర్లు, పార్టీ కండువాలతో కదిలిన కేడర్
- 'పోలింగ్' పేపర్ వర్క్‌లో బిజీగా నేతలు

ముగిసిన 'స్టార్ల' ప్రచారం..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రులుగా ఉన్నారు. వీరంతా గత నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్ గెలుపు కోసం శ్రమిస్తున్నారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో మూడు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ కూటమిలో భాగస్వాములుగా ఉన్న కమ్యూనిస్టు నేతలు కూనంనేని సాంబశివరావు, పోతినేని సుదర్శన్‌తో పాటు ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ఎన్నికల ప్రచారానికి వచ్చారు. తాజాగా సినీనటుడు దగ్గుబాటి వెంకటేష్ జిల్లా యాత్రతో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి సినీ గ్లామర్ సైతం తోడైంది. అయితే కాంగ్రెస్ పార్టీ తరపున జాతీయస్థాయి నేతలు పెద్దగా ప్రచారంలో పాల్గొనలేదు. బీఆర్ఎస్ తరపున కేసీఆర్ ఖమ్మం, కొత్తగూడెంలో రోడ్‌షోలు నిర్వహించి పార్టీలో జోష్ నింపారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరపున ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుసాయ్, బస్తర్‌కు చెందిన కాకతీయ వంశ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్ ప్రచారం నిర్వహించారు. దీంతో దాదాపుగా అన్ని పార్టీల తరపున జిల్లాలో స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం ముగిసినట్టే అనే పరిస్థితి నెలకొంది.

పోలింగ్ పనుల్లో నాయకత్వం..

పోలింగ్ తేదీ సమీపించడంతో రాజకీయ పార్టీలు పేపర్ పనుల్లో మునిగిపోయాయి. ఆయా బూత్‌ల వారీగా పోలింగ్ ఏజెంట్ల నియామకాలకు సంబంధించిన పనుల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వం తలమునకలైంది. పోలింగ్ ఏజెంట్ల గుర్తింపు, పాస్‌ల జారీకి సంబంధించిన జాగ్రత్తలు తదితర వ్యవహారాలతో ఆయా పార్టీల ఎన్నికల కార్యాలయాలు బిజీగా మారాయి. వీటికి తోడు కుల సంఘాలు, వివిధ కార్మిక సంఘాలు, యూనియన్లతో సమావేశాలు సైతం తెరపైకి వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో తమకు మద్దతు ప్రకటించాలంటూ సంఘ నాయకులకు పార్టీల నేతలు విన్నపాలు చేస్తున్నారు.

బూత్‌ల వారీగా ప్రచారం..

స్టార్ క్యాంపెయినర్ల ప్రచారాలు, భారీ బహిరంగ సభలు దాదాపుగా పూర్తి కావడంతో పార్టీ యంత్రాంగం ఇంటింటి ప్రచారంపై దృష్టి సారించింది. ఇప్పటికే బూత్‌ల వారీగా నియమించిన కమిటీలను అప్రమత్తం చేస్తూ ఆయా నేతలు ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. స్టార్ క్యాంపెయినర్లు, పార్టీ అభ్యర్థులతో సంబంధం లేకుండా ప్రతీ రోజు బూత్‌ల వారీగా ఎన్నికల ప్రచారం నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. పట్టణాల్లో అయితే వార్డుల వారీగా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పార్టీ జెండాలు ధరించిన కేడర్ ప్రతీ ఇంటికి వెళ్లి ఓటర్లను పలకరించి అభ్యర్థి పేరు, గుర్తు, బ్యాలెట్ నమూనాలు చూపిస్తున్నారు. దీంతో నిన్నామొన్నటి వరకు బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లకు వెళ్లిన ఓటర్లకు.. ఇప్పుడు వారింటి దగ్గరికే రాజకీయ నాయకుల ఉపన్యాసాలు చేరాయి. మరోవైపు ప్రచార రథాలు క్షణం తీరిక లేకుండా గల్లీల్లో రయ్‌రయ్‌మంటున్నాయి. ఆయా పార్టీలు రూపొందించిన పాటలు, వీడియోలతో పాటు కళాజాతాల ద్వారా ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తున్నాయి.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఓటు హక్కు వినియోగించుకోండి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం డీఆర్‌డీఓ, డీడబ్ల్యూఓ, మెప్మా ఆధ్వర్యంలో ఓటర్ అవేర్‌నెస్ స్వీప్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రియాంక ఆల ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతీ ఓటు ఎంతో విలువైనదని అర్హులంతా తప్పకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా మెరుగైన భవిష్యత్ కోసం సమర్థవంతమైన నాయకులకు ఓటు వేయాలని సూచించారు. పోలింగ్ నిర్వహించే మే 13న సెలవు రోజుగా ప్రకటించినట్లు చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడలో మహిళలు మూలస్తంభాలని అన్నారు. ఈ సందర్భంగా 100 మంది మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. డీఐఈఓ సులోచనారాణి, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూయ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, డీడబ్ల్యూఓ విజేత, కలెక్టరేట్ ఏఓ గన్యా, మెప్మా పీడీ రాజేష్ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి..

వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో సాగు విస్తీర్ణం ఆధారంగా అవసరమైన పత్తి, మొక్కజొన్న, మిరప విత్తనాలను సిద్ధం చేయాలని, ఎక్కడా కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పత్తి విత్తన ప్యాకెట్లు గరిష్టంగా రూ.864 చొప్పున మాత్రమే అమ్మాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలనే సాగు చేసేలా రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ వానాకాలంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, జిల్లాలో పత్తి 2,16,625 ఎకరాలు, మొక్కజొన్న 60,200, మిరప 32,168 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశామని, అందుకు అనుగుణంగా విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. డీలర్లు విత్తనాలు విక్రయించేప్పుడు తప్పకుండా బిల్లు ఇవ్వాలన్నారు. రైతులు విడిగా ఉండే విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. సమావేశంలో డీఏఓ బాబూరావు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి సూర్యనారాయణ, జిల్లా సహకార శాఖాధికారి ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి..

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ప్రియాంక ఆల అన్నారు. ఎన్నికల విధుల్లో భాగస్వాములైన అధికారులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్, తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఇంకా కొనసాగుతున్నాయని, వెంటనే పూర్తిచేసి ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అన్నారు. పనులు రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. చెరువుల వద్ద ఉపాధి పనులను పరిశీలించాలని, సారవంతమైన మట్టిని రైతుల పొలాలకు ఉపయోగించుకోవడానికి మాత్రమే సొంత ఖర్చులతో తీసుకువెళ్లాలని అన్నారు. జూన్ 5 వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డీపీఓ చంద్రమౌళి, డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక బుధవారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా కేవీకే స్వర్ణోత్సవాలు



వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్వర్ణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కేవీకే శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రైతులు శాస్త్రీయంగా వ్యవసాయం చేస్తే దిగుబడులు అధికంగా వస్తాయని, ఈ విషయంలో కేవీకే తోడ్పాటు అందిస్తోందని అన్నారు. కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి. లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త బి.శివ, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, ఉద్యాన అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం వాయిదా

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయ ప్రాంగణంలోని దుకాణాలకు బుధవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఈఓ జి.సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తిరిగి టెండర్ల ఖరారు తేదీలను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి : మండలంలోని నర్సాపురంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ ఎన్.రవి బుధవారం పరిశీలించారు. పనుల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా పనికి ఉదయమే రావాలని, రూ. 300 కూలి తగ్గకుండా పని చేయాలని సూచించారు. ఉపాధి కూలీలతో కలిసి మట్టి తవ్విని ఆయన పనులు వేగవంతం చేయాలని, కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ ప్రమీల, టెక్నికల్ అసిస్టెంట్ పద్మ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి

ఓరుగల్లు వాసికి అవకాశమిచ్చిన బీజేపీ



ప్రేమేందర్ రెడ్డి

హన్మకొండ: నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని అధిష్టానం బుధవారం ప్రకటించింది. ప్రస్తుత హనుమకొండ జిల్లా దామెరలో ఎస్సెస్సీ, పరకాలలో ఇంటర్, వరంగల్ సీకేఎం కళాశాలలో బీఎస్సీ, ఓయూలో ఎమ్మెస్సీ, మరఠ్వాడ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఏబీవీపీ, బీజేవైఎంలో పలు పదవులు నిర్వర్తించడమే కాక పూర్వ వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. గత పన్నెండేళ్లుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ప్రేమేందర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలోనూ కీలకంగా పాల్గొన్నారు. కాగా, 2004లో శాయంపేట, 2009లో పరకాల నియోజకవర్గాల నుంచి బీజేపీ అభ్యర్థిగా అసెంబ్లీ బరిలో నిలిచిన ప్రేమేందర్‌రెడ్డి, 2021లో జరిగిన నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీకి దిగారు. ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికల్లోనూ ఆయనకు టికెట్ కేటాయించగా గురువారం ఆయన నల్లగొండలో నామినేషన్ వేయనున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ చేతిలో మరోసారి మోసపోవద్దు
- బస్తర్ మహరాజ్ కమల్‌చంద్ర భంజ్‌దేవ్



కొత్తగూడెం ఎన్నికల ప్రచారంలో కమల్‌చంద్ర, అభ్యర్థి వినోద్‌రావు

చుంచుపల్లి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని, అందులో ఉమ్మడి జిల్లా కూడా ఉండాలంటే ఖమ్మం ఎంపీగా తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని బస్తర్ మహారాజు, కాకతీయ వంశ వారసుడు కమల్‌చంద్ర భంజ్ దేవ్ ఓటర్లను కోరారు. కొత్తగూడెంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇతర పార్టీలకు అవకాశం ఇచ్చారని, ఈసారి బీజేపీకి ఇవ్వాలని అన్నారు. వినోద్‌రావును గెలిపిస్తే రెండేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు మీ ఇంటికే అందజేస్తారని భరోసా ఇచ్చారు. కట్టెల పొయ్యితో బాధపడుతున్న మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం ద్వారా రాయితీపై గ్యాస్ అందించిందని చెప్పారు. ఎన్నికల సమయంలో అబద్ధపు వాగ్దానాలతో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులను నమ్మొద్దని సూచించారు. ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ.. కొత్తగూడెం ప్రజలను చూస్తుంటే వెయ్యి ఏనుగుల బలం వస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే కొత్తగూడేనికి మంచి ఆస్పత్రి, ఐటీ హబ్ తెస్తానని, మూతపడే దశలో ఉన్న కేటీపీఎస్ పునర్ వైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చి రవాణా సౌకర్యం మరింత మెరుగుపరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.వీ. రంగాకిరణ్, సీనియర్ నాయకులు జీవీకే.మనోహర్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాను అరికట్టండి

- నగదు, మద్యం తరలించకుండా నిఘా పెంచాలి
- ఎస్పీ రోహిత్‌రాజ్



బొమ్మనపల్లిలో చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

ఇల్లెందు : ఎన్నికల వేళ మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఇల్లెందు సబ్ డివిజన్ పరిధిలోని అంతర్ జిల్లా చెక్‌పోస్టులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తయ్యే వరకు చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, చెక్ పోస్టుల వద్ద నిఘా కఠినంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని, ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఇల్లెందు పోలింగ్ స్టేషన్‌లో రూట్ మ్యాప్, స్టేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎన్. చంద్రభాను, సీఐలు కరుణాకర్, సురేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్‌ఐ సందీప్ తదితరులు ఉన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి (కారుకొండ క్రాస్‌రోడ్) వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనుమానం ఉన్న ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీ వివరాలపై సీఐ తాటిపాముల సురేష్‌తో చర్చించారు.

ఏ రైతుకూ కష్టం రానివ్వం..

- ఆగస్టు 15లోపు రుణమాఫీ.. జూలైలోగా సీతారామ ట్రయల్ రన్
- కిసాన్ కాంగ్రెస్ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన అభ్యర్థి రఘురాంరెడ్డి, నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ నేతృత్వాన కొనసాగుతున్నది రైతు ప్రభుత్వమని.. రాష్ట్రంలోని ఏ రైతుకూ కష్టం రాకుండా చూసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ లోక్‌సభ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం అబద్ధాలు, అభూత కల్పనలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తే తాము సరిదిద్దుతున్నామని చెప్పారు. రైతులకు విత్తన కంపెనీల నుంచి ఇబ్బంది రాకుండా మేలైన విత్తనాలు అందేలా ప్రభుత్వం సహాయకారిగా ఉంటుందన్నారు. వచ్చే జూలైలోపు సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ పూర్తిచేసి ఆగస్టులో వైరా రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపుతామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని చెప్పారు. రైతుల సంక్షేమానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉన్నందున అకాల వర్షంతో తడిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని తెలిపారు. ఇక రైతుల తరఫున పంట బీమా సైతం ప్రభుత్వమే చెల్లించనుందని మంత్రి ప్రకటించారు. కాగా, నల్లగొండ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఐదు లక్షల మెజార్టీ సాధిస్తామని అక్కడి నేతలు ధీమాగా ఉన్నందున.. ఖమ్మంలో మరింత మెజార్టీ సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని తుమ్మల కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుగా డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, బాలసాని లక్ష్మీనారాయణ, బేబీ స్వర్ణకుమారి, వడ్డెబోయిన నర్సింహారావు, దాసరి డానియేలు, మొక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యత పెంపే లక్ష్యంగా..

- బడిబయట ఉన్న చిన్నారుల కోసం సర్వే
- ప్రతీ జనవరి, మే నెలల్లో నిర్వహణ
- ఈ ఏడాది ఇప్పటివరకు 572 మంది గుర్తింపు
- వచ్చే నెల పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు



పినపాకలో సర్వే చేస్తున్న సీఆర్పీ

కొత్తగూడెంఅర్బన్: మధ్యలో చదువు మానేసి పనులకు వెళ్తున్న బడి ఈడు బాలబాలికలను గుర్తించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇలాంటి వారి కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జనవరి, మే నెలల్లో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం జిల్లాలోని 23 మండలాల్లో 90 మంది సీఆర్పీలు బడి మానేసిన పిల్లల గుర్తింపు కోసం గ్రామాల బాట పట్టారు. ఆరు సంవత్సరాలు, ఆపైబడిన వారిని గుర్తించి వివరాలు నమోదు చేస్తున్నారు. జనవరి, మే నెలల్లో చేసిన సర్వే వివరాల ప్రకారం ఒక ప్రణాళిక తయారు చేసి జూన్ నాటికి ఎంఈఓలకు నివేదిక అందిస్తారు. దాని ఆధారంగా ఉపాధ్యాయులు పాఠశాలలు తెరవగానే వారిని రీ అడ్మిషన్లు చేయిస్తున్నారు. అయితే ఈ తంతు ప్రతీ ఏడాది జరుగుతున్నా.. ఈ సంవత్సరం బడి బయట ఉన్న పిల్లల సంఖ్య ఒక జనవరి నెల సర్వేలోనే 572 మంది ఉన్నట్లు తేలడం గమనార్హం. బాలబాలికల కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం, కుటుంబ పెద్దలు అనారోగ్యానికి గురి కావడం, చిన్నారులు పనికి వెళ్లకుంటే ఇల్లు గడిచే పరిస్థితి లేకపోవడం వంటి కారణాలతో చదువుకోవాల్సిన వయసులో పనిబాట పడుతున్నారు. దీంతో జిల్లాలో అక్షరాస్యత శాతం తగ్గిపోయే ప్రమాదం ఉండడంతో దాని నివారణకు సీఆర్పీలు చర్యలు చేపడుతున్నారు.


ఈ పనుల్లోనే ఎక్కువగా..

జిల్లాలో చదువు మానేసి పనిలోకి వెళ్లే బాలబాలికలు ఎక్కువగా ఇటుక బట్టీలు, సిమెంటు బ్రిక్స్ తయారీ, కిరాణాషాపులు, షాపింగ్ మాళ్లు, హోటళ్లలో కూలీలుగా మారుతున్నారు. ఆయా ప్రాంతాల్లో బాల కార్మికులు పని చేస్తున్నారని తరుచుగా కార్మిక శాఖ కార్యాలయానికి ఫిర్యాదులు అందుతుంటాయి. ఆ సమయంలో మాత్రమే సంబంధిత అధికారులు అక్కడికి వెళ్లి షాపు యజమానులకు జరిమానాలు విధించి, ఆ తర్వాత పట్టించుకోరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ తర్వాత మళ్లీ చిన్నారులు పనులకు వెళుతూనే ఉన్నారు. దీంతో ఇటీవల చేపట్టిన సర్వేలో 572 మంది బాలబాలికలు బడిబయట ఉన్న విషయం వెలుగుచూసింది. ఇక ఈ నెల సర్వే పూర్తయితే ఇంకెంత మంది బయటపడుతారో వేచి చూడాల్సిందే. ఇలా గుర్తించిన వారంతా తిరిగి పాఠశాలలకు వెళితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం ఉంటుంది.

జనవరిలో సర్వే వివరాలు ఇలా..

వయసు	బాలురు	బాలికలు	మొత్తం
6 - 14	267	162	429
15 - 19	101	42	143

బడి బయట పిల్లలను చేర్పించడమే లక్ష్యం



బడి బయట ఉన్న బాలబాలికలను బడిలో చేర్పించడమే లక్ష్యంగా సర్వే అనంతరం అడ్మిషన్లు చేయిస్తున్నాం. సర్వేలో మొదట బాలబాలికల గుర్తింపు, బడి మానేయడానికి గల కారణాలు తెలుసుకుంటున్నాం. వారిని తిరిగి బడికి వెళ్లేలా ప్రోత్సహిస్తున్నాం. దగ్గరలో ఉన్న స్కూల్, హాస్టల్‌కు పంపించే ప్రయత్నాలు చేస్తున్నాం. దీంతో పాటు జిల్లాలో 15 సంవత్సరాలు పైబడిన వారిని ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ఇప్పించి, సమగ్ర శిక్ష అభియాన్ నుంచి కొంత స్కాలర్‌షిప్ వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నాం.

– నాగరాజశేఖర్, ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ కో– ఆర్డినేటర్

క్లుప్తంగా

ఓటు వేసిన డీఎస్పీ



సెల్ఫీ పాయింట్ వద్ద డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఖమ్మంలో తన ఓటును వినియోగించుకున్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకున్నారు.

రూ.లక్ష నగదు సీజ్..


నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్‌ఐ రాజేశ్‌కుమార్

మణుగూరురూరల్: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును మణుగూరు ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ బుధవారం సీజ్ చేశారు. మండలంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో రూ.లక్ష తీసుకెళ్తున్న వై.డానియేల్‌ను పోలీసులు సోదా చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

వడదెబ్బతో నాగారం హెచ్‌ఎం మృతి


బొడ్డు శ్రీరాములు (ఫైల్)

పాల్వంచరూరల్: వడదెబ్బతో అస్వస్థతకు గురై ఓ హెడ్ మాస్టర్ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నాగారం హైస్కూల్లో 2015 జూలై నుంచి హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న, ఏపీ రాష్ట్రంలోని చింతూరు మండలం చట్టీ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీరాములు(60) మంగళవారం ఎండలో తిరిగి వచ్చాడు. అనంతరం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన స్థానిక వైద్యులను సంప్రదించాడు. కానీ, పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. శ్రీరాములు మృతదేహాన్ని స్వస్థలమైన చట్టీకి తరలించారు. మృతునికి భార్య భవాని, కుమారుడు సిద్ధు, కుమార్తె సింధు ఉన్నారు.

పాల్వంచలో ఒకరు..

పాల్వంచ: వడదెబ్బతో అస్వస్థతకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని సీతారాంపట్నానికి చెందిన బోళ్ల శ్రీనివాసరావు కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎండ వల్ల వడదెబ్బకు గురయ్యాడు. బుధవారం ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

కేటీపీఎస్ ఉద్యోగి ఆత్మహత్య

పాల్వంచ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక కేటీపీఎస్ ఉద్యోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇందిరా కాలనీకి చెందిన గార్లపాటి ప్రసాద్(42) కేటీపీఎస్ ఏడో దశ సీహెచ్‌పీలో పీఏగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి నలుగురు కూతుర్లు కాగా, అందరి పెళ్లిళ్లు జరిపించాడు. ఈ క్రమంలో అప్పులు కావడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటిముందు వరండాలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ప్రసాద్ భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాము తెలిపారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పీకే–1 సెంటర్‌లో గుగులోత్ మురళీకృష్ణపై హత్యాయత్నానికి పాల్పడిన కుర్రం నాగేశ్వరరావును అరెస్ట్ చేసినట్లు మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 5వ తేదీన గుగులోత్ మురళీకృష్ణపై కుర్రం నాగేశ్వరరావు కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కుర్రం నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారించడంతో పాటు హత్యాయత్నానికి వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

బెల్టు దుకాణంపై దాడి

అశ్వాపురం: మండల కేంద్రంలో మార్కెట్ వద్ద ఓ బెల్ట్‌దుకాణంపై దాడి చేసిన పోలీసులు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న ఎస్‌ఐ తిరుపతిరావు సిబ్బందితో దాడి చేసి సుమారు రూ.10 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,229

చల్లని వేళ కానిచ్చేద్దాం..!

- ఉదయం, సాయంత్రమే ఎన్నికల ప్రచారం
- ప్రజాసమూహాల వద్దకు వెళ్లేలా కార్యాచరణ
- భానుడి భగభగతో జంకుతున్న పార్టీల నేతలు


కొణిజర్లలో ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారానికి మండే ఎండలు అడ్డంకిగా మారాయి. కార్యకర్తలు సైతం ఎండలో బయటకు రావడానికి జంకుతున్నారు. దీంతో జనసమీకరణతో పని లేకుండా గంపగుత్తగా ఒకే చోట వందల సంఖ్యలో ఉండే ఓటర్లను కలిసేందుకే అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదయం భానుడి ప్రతాపం ప్రారంభమయ్యే లోగా.. సాయంత్రం వేడి తగ్గాక ప్రచారానికి మొగ్గు చూపుతున్నారు. మిగతా సమయం పరిస్థితులను బేరీజు వేసుకుంటూ లోపాలను సరిచేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు.

ఇంటింటి ప్రచారం అంతంతే..

అభ్యర్థులు, పార్టీల నాయకులు ఎక్కువగా ఇన్నాళ్లు రోడ్డుషోలు, కార్నర్ మీటింగ్‌లకే ప్రాధాన్యత ఇచ్చారు. స్టార్ క్యాంపెయినర్లు వచ్చినా ఉదయం, సాయంత్రమే ప్రచారంలో పాల్గొన్నారు. ఇక అభ్యర్థులు, నాయకులైనా సరే ఎక్కువ మంది ఉండే చోట్లకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. అంతేతప్ప ఇప్పటివరకైతే ఇంటింటి ప్రచారం పెద్దగా చేయలేదనే చెప్పాలి. ఎండ సమయంలో బయటకు వెళ్లినా ఓటర్లను కలిసే పరిస్థితి లేకపోవడం.. సభలు, కార్నర్ మీటింగ్‌లు పెట్టినా వేడికి జన సమీకరణ కష్టమవుతోందనే భావనతో ఉదయం, రాత్రి ప్రచారం చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఎక్కువ ఖర్చు లేకుండానే..

ఎండలతో పార్టీల కార్యకర్తలు, ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఓటర్లను కలిసేందుకు పార్టీల అభ్యర్థులు, నాయకులు కొత్త పంథా ఎంచుకుంటున్నారు. పెద్ద మొత్తంలో జనం ఉండే ప్రాంతాల్లోనే తమ ప్రచారం నిర్వహించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణాలు, నగరంలో వేకువ జామున మైదానాల్లో వాకర్లను కలిసి ఓట్లు అభ్యర్థించడం కనిపిస్తోంది. గ్రామాల్లో నైతే ఉపాధి హామీ పని ప్రదేశాలకు వెళ్తే అక్కడ వందల సంఖ్యలో ఉన్న కూలీలను కలుస్తున్నారు. వీరిని కలిసి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు పనిలో పనిగా తమను గెలిపించాలని కోరుతున్నారు. దీంతో పార్టీ అభ్యర్థికి రూపాయి ఖర్చు లేకుండా ప్రచారం జరిగిపోతోంది. చల్లని వేళ మైదానాలు, పనిప్రదేశాలనే ఎక్కువగా ఎంచుకుని ఓటర్లను కలవడమే కాకుండా, జనసమీకరణ కూడా లేకుండా ప్రచారం ముగించేస్తున్నారు. అంతేకాక శుభ, అశుభకార్యాలు ఎక్కడ జరిగినా.. ఆహ్వానం అందినా, లేకున్నా అభ్యర్థులు, రాజకీయ నాయకులు వెళ్లి తమను తాము పరిచయం చేసుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

చల్లబడిన వాతావరణం

రెండు రోజులుగా గాలిదుమారం, వర్షంతో జిల్లాలో దాదాపు అన్ని చోట్ల వాతావరణం కాస్త చల్లబడింది. ఇంతలో ప్రచారం ముగిసే సమయం కూడా ముగియవస్తోంది. దీంతో మిగిలిన తక్కువ సమయాన్ని ఇంటింటి ప్రచారానికి వినియోగించుకునేలా పార్టీల నాయకులు కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీల అగ్రనేతలు వచ్చి వెళ్లడంతో జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకుల ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారంపై ఫోకస్ చేయనున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

విజ్ఞానం ఉద్యోగం కోసమే కాదు..



మాట్లాడుతున్న డాక్టర్ సీమ

- ప్రతీ విద్యార్థి ఇంకొకరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి
- వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ సీమ

అశ్వారావుపేటరూరల్: కళాశాలలో నాలుగేళ్ల పాటు శ్రమించి, ఎంతో కష్టపడి నేర్చుకున్న వ్యవసాయ విద్య, విజ్ఞానాన్ని ఉద్యోగాలతో సరిపెట్టుకోవద్దని డీన్ ఆఫ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ డాక్టర్ సీమ, రవి హైబ్రిడ్స్ కంపెనీ ఎండీ మన్నేపల్లి రవి అన్నారు. బుధవారం రాత్రి జరిగిన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల వార్షికోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ విద్య ఎంతో కష్టంగా ఉంటుందని, విద్యార్థులు ఉద్యోగాల కోసమే ఈ విద్యను అభ్యసించకుండా తాము ఉపాధి పొందుతూనే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రతి విద్యార్థి కొత్త తరహాలో ఆలోచించాలని, వ్యవసాయ విద్య పూర్తి చేసిన వారికి అనేక రంగాల్లో అవకాశాలు వస్తాయని అన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎస్‌ఏ డాక్టర్ జెల్లా సత్యనారాయణ, కళాశాల డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, సీఐ జితేందర్‌రెడ్డి, కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా.. అందరూ చూసేలా !


ఒంటెపై తిరుగుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

లోక్‌సభ ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు అందివచ్చే ఏ అవకాశాన్ని వదలడం లేదు. ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరపున బుధవారం నాయకులు ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఒంటెలతో వచ్చిన రాజస్థాన్ వాసులు కనిపించగా.. కాసేపు ఒంటెలపై ఎక్కి బీజేపీ పతాకాలతో వీధుల్లో తిరుగుతూ ప్రచారం చేస్తుండగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– ఖమ్మం మామిళ్లగూడెం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


ఇంటిక సునీత (ఫైల్)

దమ్మపేట: బైక్ పైనుంచి కిందపడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పట్వారిగూడెం గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన ఇంటిక సుధాకర్ (34), సునీత (32) దంపతులు, వారి సంతానం ప్రయన్ (7), నీరంత్ (5)తో కలసి బైక్‌పై బుధవారం ములకలపల్లి మండలంలోని నర్సాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. వారు పట్వారిగూడెం గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా కోతుల గుంపు వచ్చింది. సుధాకర్ కంగారుపడి అకస్మాత్తుగా బ్రేక్ వేయగా వెనుక కూర్చున్న సునీత రోడ్డుపై పడింది. గమనించిన స్థానికులు, భర్త సుధాకర్, క్షతగాత్రురాలిని వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి కొర్సా భద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. సునీత మృతితో గండుగులపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ తీగలను తాకిన ఆవు మృతి

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తిలో గాలిదుమారానికి తెగిపడిన విద్యుత్ తీగలను తాకిన ఓ ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. బుధవారం నాటి గాలివానకు గ్రామంలో గొడ్ల వెంకటేశ్వర్లు పొలంలో చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడడంతో అవి తెగిపోయాయి. అయితే, గురువారం మేతకు వెళ్లిన లింగన్నబోయిన రామయ్యకు చెందిన ఆవు తీగలను తాకగా విద్యుత్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు పరిశీలించి వివరాలు సేకరించారు.

కలకోటలో పాడి గేదె...

బోనకల్: మండలంలోని కలకోటలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామంలోని పెరుమాళ్లపల్లి బాబుకు చెందిన పాడి గేదె పొలంలో మేత మేస్తుండగా గాలి దుమారానికి తెగిపడిన 11కేవీ విద్యుత్ వైరు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.70వేల విలువైన గేదె మృతి చెందినందున తనకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాబు కోరాడు.

పట్టభద్రుల స్థానానికి 19మంది నామినేషన్

- నేటితో ముగియనున్న గడువు

నల్లగొండ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం 19మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వివిధ పార్టీల నుంచే కాక స్వతంత్రులు తమ నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ దాసరి హరిచందనకు అందజేశారు. కాగా, గురువారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగియనుండగా, ఇప్పటి వరకు 67మంది నామినేషన్లు దాఖలు చేశారని అధికారులు వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడి

దమ్మపేట: మండలంలోని చిన్నగొల్లగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నగొల్లగూడెం శివారులో బుధవారం పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,650 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకకు చెందిన ఇద్దరు వృద్ధులు బుధవారం వేర్వేరు కారణాలతో మృతి చెందారు. గ్రామానికి చెందిన కొలగాని నాగయ్య(80) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో పాటు ఎండలకు ఆరోగ్యం మరింత క్షీణించి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన వంకాయల పాటి అచ్చమ్మ(85) సైతం అనారోగ్యంతో బాధపడుతూ వడదెబ్బ బారిన మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

జూలూరుపాడు: మండలంలోని చింతలతండా గ్రామ పంచాయతీ లయన్‌తండాలో కొద్దిరోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో గిరిజనులు ఖాళీ బిందెలతో బుధవారం నిరసన తెలిపారు. ఎండను సైతం లెక్క చేయకుడా మహిళలు, పెద్దలు, యువతీ, యువకులు, చిన్నారులు రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని, నెలరోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు. మిషన్ భగీరథ ట్యాంకు నిర్మించినా నీళ్లు ఎక్కకపోవడంతో నిరుపయోగంగా ఉందని, అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

బంగారు ఆభరణాలు చోరీ


చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

పాల్వంచ: ఇంట్లోని వ్యక్తులు ఊరెళ్లడంతో దుండగులు లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల కథనం మేరకు.. పట్టణంలోని కాంట్రాక్టర్‌కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్ తన కుటుంబంతో కలిసి మూడు రోజుల కిందట ఊరెళ్లారు. బుధవారం ఉదయం ఇంట్లో పనిచేసే మహిళ వచ్చి చూడగా ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగులగొట్టినట్లు గుర్తించి ఉదయ్‌కుమార్‌కు సమాచారం అందించింది. అతను తన తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. దీంతో వారు వచ్చి పరిశీలించగా రూ.5 లక్షల విలువ చేసే 140 గ్రాముల బంగారు వస్తువులను చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని సందర్శించారు.

ఫొటో మార్ఫింగ్.. సంతకం ఫోర్జరీ

- రుణం కోసం పొదుపు సంఘం ఎత్తుగడ
- పంపకంలో తేడా రావడంతో వెలుగులోకి ఉదంతం

ఇల్లెందురూరల్: రుణం చేతికందుతుందన్న తొందరలో ఓ సభ్యురాలి ఫొటో మార్ఫింగ్ చేయడంతోపాటు సంతకం కూడా ఫోర్జరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని పది మంది సభ్యులున్న శ్రీ ఆంజనేయం పొదుపు సంఘానికి సుదిమళ్ల ఎస్‌బీఐ నుంచి ఏడాది కిందట రూ.10 లక్షలు బ్యాంకు లింకేజీ పేరుతో రుణం మంజూరైంది. ఈ సొమ్మును గ్రూపులోని కొందరు సభ్యులు పంచుకుని, క్రమం తప్పకుండా ఏడాదిపాటు అసలుతోపాటు వడ్డీ కలిపి మొత్తం రూ.2.50 లక్షలు చెల్లించారు. ఇంకా రూ.7.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. కొద్ది రోజుల కిందట సుదిమళ్ల బ్యాంకు అధికారులు అదే గ్రూపునకు రూ.15 లక్షలు బ్యాంకు లింకేజీ రుణం మంజూరు చేశారు. దీనికోసం డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని సెర్ప్ అధికారులకు, గ్రూపు సభ్యులకు సూచించారు. ఇదిలా ఉండగా గ్రూపులోని పది మంది సభ్యుల్లో ఒకరు స్థానికంగా ఉండటం లేదు. దీంతో డాక్యుమెంటేషన్ పూర్తి చేయడం గ్రూపు సభ్యులకు ఇబ్బందిగా మారింది. అయితే, స్థానికంగా లేని సభ్యురాలి సోదరి ఉండటం, ఆమె వద్ద తన సోదరి ఫొటో ఉండటంతో తొమ్మిది మంది సభ్యులు దిగిన ఫొటోలో స్థానికంగా లేని సభ్యురాలి ఫొటోను మార్ఫింగ్ చేయించారు. డాక్యుమెంటేషన్‌లో ఆమె సంతకాన్ని గ్రూపు సభ్యులే ఫోర్జరీ చేసి రుణం మంజూరు కోసం బ్యాంకులో అందజేశారు. డాక్యుమెంటేషన్ పరిశీలించిన బ్యాంకు అధికారులు గతంలో తీసుకున్న రుణంలో మిగిలిపోయిన రూ.7.50 లక్షలను మినహాయించుకొని మిగతా రూ.7.50 లక్షలను పొదుపు సంఘం సభ్యులకు మంజూరు చేశారు. సంబంధిత సొమ్మును సభ్యుల అకౌంట్లలో జమ చేశారు. ఇదిలా ఉండగా అకౌంట్లలో జమ అయిన సొమ్మును పంచుకోవడంలో సభ్యుల మధ్య వివాదం తలెత్తింది. గతంలో మంజూరైన రుణంలో రూ.లక్ష తీసుకొని పూర్తిస్థాయిలో చెల్లించకుండానే ఓ సభ్యురాలు ఊరు విడిచి వెళ్లిపోవడంతో రికవరీ ఇబ్బందిగా మారుతుందన్న ఆందోళనతో ఆమెకు తిరిగి రుణం ఇచ్చేందుకు మిగతా సభ్యులు నిరాకరించారు. దీంతో సదరు సభ్యురాలు రుణం మంజూరు కోసం సభ్యులందరూ కలిసి చేసిన ఫొటో మార్ఫింగ్, సంతకం ఫోర్జరీ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. ఆనోట.. ఈనోట విషయం తెలుసుకున్న సుదిమళ్ల ఎస్‌బీఐ, సెర్ప్ అధికారులు జరిగిన తప్పిదాన్ని సరిచేసే ప్రయత్నాలు ప్రారంభించారు. సభ్యులందరినీ సమావేశపర్చి చర్చించారు. మంజూరైన నిధులు డ్రా చేయకుండా వారి అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. తీసుకున్న రుణం మొత్తం రూ.15 లక్షలు తిరిగి చెల్లించాలని బ్యాంకు అధికారులు షరతు పెడుతుండగా ఒకే సారి చెల్లించలేమని, తాజాగా మంజూరైన రూ.7.50 లక్షలు మాత్రమే వెంటనే చెల్లిస్తామని పొదుపు సంఘం సభ్యులు బదులిస్తున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం పొదుపు సంఘాల్లో చర్చనీయాంశంగా మారింది.

మార్ఫింగ్ చేసినట్లు గుర్తించాం..



బ్యాంకు లింకేజీ రుణం మంజూరు కోసం పొదుపు సంఘం సభ్యులు ఓ సభ్యురాలి ఫొటోను మార్ఫింగ్ చేసినట్లు గుర్తించాం. బ్యాంకు అధికారులతో సభ్యుల అకౌంట్లను ఫ్రీజ్ చేయించాం. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– దుర్గారావు, ఏపీఎం, ఇల్లెందు

పాల్వంచలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాల్వంచ: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పాల్వంచ, కొత్తగూడెం డీఎస్పీలు సతీశ్ కుమార్, రెహమాన్ ప్రజలకు సూచించారు. బుధవారం సాయంత్రం పట్టణంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమై మార్కెట్ రోడ్, నటరాజ్ సెంటర్, బీసీఎం రోడ్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు వేయాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల భద్రత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు వినయ్‌కుమార్, ఆర్.వెంకటేశ్వర్లు, శివప్రసాద్, పాల్వంచ, బూర్గంపాడు, ములకలపల్లి ఎస్‌ఐలు బి.రాము, రాఘవయ్య, స్వప్న, సుమన్, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘బీజేపీతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం’


ప్రచారం చేస్తున్న జి.వీరన్న, నాయకులు

కరకగూడెం: ప్రజా స్వామ్యానికి బీజేపీతో పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, గిరిజన మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ జి.వీరన్ననాయక్ విమర్శించారు. ఆయన బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ‘బీజేపీని ఓడిద్దాం.. కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం’నినాదంతో ప్రచారం నిర్వహించారు. మానుకోట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలిపించాలని కోరారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దుచేయాలని యోచిస్తోందని, బీజేపీ తీరు దేశానికి ఎంతో ప్రమాదకరమని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ ఓడిపోతుందనని జోస్యం చెప్పారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించి, హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, ఎర్ర సురేశ్, కొమరం కాంతారావు, శివరాత్రి సతీశ్, భూక్య అర్జున్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యాన్ని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని రామాలయ ప్రాంతంలో గల ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని భద్రాచలం టౌన్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యాన్ని ఇంట్లో నిల్వ చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేయగా సుమారు రూ.25 వేల విలు వైన మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలి పారు. ఈ తనిఖీలలో పట్టణ ఎస్‌ఐలు పీవీఎన్ రావు, విజయలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనే ప్రథమ చికిత్స





ప్రియా దేశాయ్

సేవ

ఈ ఫొటోను చూడండి.
ఇందులో ఉన్నది షుగర్ పేషెంట్లు.
ఒకరితో ఒకరు షుగర్ వ్యాధి గురించి
మాట్లాడుకుంటూ
అవగాహన కల్పించుకుంటున్నారు.
'చికిత్స కంటే అవగాహన ముఖ్యం'
అంటారు ప్రియా దేశాయ్.
బెంగళూరులో ఆమె పేదవారి కోసం
ఉచిత క్లినిక్‌లు నడుపుతున్నారు.
డయాబెటిస్, బి.పి ఉన్న వారికి
సదస్సులు నిర్వహిస్తూ
ఉచిత మందులు అందేలా చూస్తున్నారు.
ప్రతి ఉదయం ఈ క్లినిక్‌ల ముందు క్యూ కట్టే
పేషెంట్లను చూస్తే ప్రియా సేవ తెలుస్తుంది.

బెంగళూరులోని శాంతి నగర్‌లో ఉన్న 'అనాహత్' క్లినిక్‌కు వెళితే ఒక బోర్డు మీద ఐదారు రకాల భోజనం ప్లేట్ల ఫొటోలు ఉంటాయి. వాటిలో రొట్టె, కూర, అన్నం, ఇతర కూరలు ఉంటాయి. ప్రతి ప్లేట్ కింద స్టార్లు ఇచ్చి ఉంటారు. ఐదు స్టార్లు ఇచ్చిన భోజనం ప్లేట్‌ను ఆహారంగా తీసుకోవాలని బీపీ, షుగర్ ఉన్న పేషెంట్లకు సులభంగా అర్థమయ్యేలా చెప్తారు. మీ ప్లేట్‌లో ఏముంది అనేదే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందని ఈ క్లినిక్‌లో వారానికి రెండుసార్లు జరిగే అవగాహన సదస్సుల్లో తెలియచేస్తారు. ఇలాంటి అవగాహన దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీల తీవ్రతను తగ్గిస్తాయని అంటారు ప్రియా దేశాయ్. ఆమె ఈ క్లినిక్ నిర్వాహకురాలు.

10 వేల మందికి ఒక క్లినిక్

బెంగళూరు జనాభా కోటీ ముప్పై లక్షలకి పైనే. కాని ఇక్కడ మొత్తం 147 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రే ఉన్నాయి. అంటే దాదాపు 80 వేల మందికి ఒక క్లినిక్. ప్రభుత్వ లెక్కల ప్రకారం చూసినా 30 వేల మందికి ఒక క్లినిక్ ఉండాలి. ఆదర్శవంతమైన పాలనా నిర్వహణ అంటే 10 వేల మందికి ఒక క్లినిక్. ఇలాంటి స్థితిలో పేదలకు ఎలా మంచి వైద్యం అందుతుంది అని అడుగుతారు ప్రియా దేశాయ్. జర్నలిజం అభ్యసించిన ప్రియ తన తల్లి రాణీదేశాయ్ స్ఫూర్తితో వైద్య సేవారంగంలోకి వచ్చారు. అనేక స్వచ్ఛంద సంస్థల్లో పని చేసిన రాణీ దేశాయ్ తన కుమార్తెతో కలిసి 'అనాహత్ క్లినిక్'కు అంకురార్పణ చేశారు. బెంగళూరులో ఉన్న పేదలకు వైద్యం అందించాలనేది అనాహత్ సంకల్పం. నేరుగా క్లినిక్‌కు వచ్చేవారికి వైద్యం అందిస్తూనే హెల్త్ క్యాంప్స్ ద్వారా స్లమ్స్‌లో వైద్య చికిత్స అందించడం అనాహత్ లక్ష్యం. ఇప్పటికి 3 లక్షల మందికి హెల్త్ క్యాంప్స్ ద్వారా వైద్యం అందించారు ప్రియ తన తల్లి రాణీదేశాయ్ చేయూతతో.



బీపీ, షుగర్ బాధితులు

'నగరాల్లో పని చేసే దిగువ ఆదాయ వర్గాల వారు సమయానికి భోజనం చేయరు. ఆహార అలవాట్లు, నిద్రలో క్రమశిక్షణ ఉండదు. శరీరాన్ని పట్టించుకోరు. దానివల్ల బీపీ బారిన పడుతున్నారు. షుగర్ వచ్చిన వారికి షుగర్ వచ్చిన సంగతి కూడా తెలియడం లేదు. మా క్లినిక్‌కు రోజుకు వంద మంది వస్తారు. ఎక్కువ మందికి ఇవే సమస్యలు. మా కౌన్సిలింగ్స్ వల్ల ఎక్కడ ఏ పనిలో ఉన్నా రాత్రి ఎనిమిదికి భోజనం చేయడం నేర్చుకున్నారు చాలామంది' అంటారు ప్రియా దేశాయ్. మిత్రుల దాతల సహాయంతో ఈ క్లినిక్‌ను నడుపుతున్న ప్రియ తగిన సహాయం దొరికితే సేవను విస్తరించవచ్చు అని తపన పడుతుంటారు.

70 రకాల పరీక్షలు

అనాహత్ క్లినిక్‌లో 70 రకాల టెస్ట్‌లు ఉచితంగా చేస్తారు. 100 రకాల మందులు ఉచితంగా ఇస్తారు. వైద్యుల పరీక్ష ఉంటుంది. వీరే కాకుండా ఫిజియోథెరపిస్ట్‌లూ సేవలు అందిస్తారు. 'ఆనంద' అనే కార్యక్రమం ద్వారా సైకియాట్రీ కౌన్సెలింగ్ కూడా ఉంటుంది. 'అన్నింటికంటే ముఖ్యం మేము పేషెంట్స్‌ను ఒక కమ్యూనిటీగా మారుస్తాం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిని ఒక గ్రూప్‌గా చేసి వారే ఒకరితో మరొకరు మాట్లాడుకుని తామంతా ఈ వ్యాధులను ఎదిరించవచ్చు అనే ధైర్యం పొందేలా చేస్తాం' అన్నారు ప్రియ. చికిత్స అందించడం ఎంత ముఖ్యమో వ్యాధి పట్ల అవగాహన, నివారణ అంతే ముఖ్యమని భావిస్తారు ఈ క్లినిక్‌లో. అందుకే బెంగళూరు పేదలు అనాహత్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రియను, ఆమె తల్లి రాణి దేశాయ్‌ను అభిమానిస్తున్నారు.

'స్లమ్స్‌లో ఉన్నవారు క్లినిక్స్‌కు రారు. స్లమ్స్‌లో హెల్త్ క్యాంప్స్ విస్తృతంగా... క్రమబద్ధంగా జరగాలి. అప్పుడే దీర్ఘకాలిక వ్యాధులు బయటపడి చికిత్స మొదలవుతుంది. లేకుంటే అనవసర మరణాలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే అందరూ ఈ విషయమై ముందుకు రావాలి' అని కోరుతున్నారు ప్రియ.

నైపుణ్యమే పెట్టుబడి

సెరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్
కష్టమైనదిగా భావిస్తూ
మహిళలు ఈ కళను ఎంచుకోవడానికి
వెనుకంజ వేస్తుంటారు.
అలాంటి ఈ కళను ఎంతో ఇష్టంగా
ఎంచుకొని, అందులో రాణిస్తోంది
తిరువనంతపుర వాసి
రోసా శ్రుతి అబ్రహాం.
సాధారణంగా పెద్ద పెద్ద కర్మాగారాల
నుంచి భారీగా ఉత్పత్తి అయ్యే
సిరామిక్ వస్తువుల గురించి
మనకు తెలిసిందే.
అత్యంత వేగవంతమైన ప్రపంచంలో
ప్రాచీన కళారూపాల వెనక దాగి ఉన్న
నైపుణ్యాన్ని ఈ తరానికి పరిచయం
చేస్తోంది రోసా శ్రుతి.



రోసా శ్రుతి అబ్రహాం

"మురికి పట్టిన ఏప్రాన్, మట్టితో నిండిన చేతులు, చిక్కుబడిపోయినట్టు చిందరవందరగా ఉండే జుట్టు.. రోజులో ఎక్కువ పనిగంటలు ఇలాగే కనిపిస్తాను. అయితే, కొంతకాలంగా వరసగా ఆర్డర్లు పొందుతున్నాను. అందుకే రోజులో ఎక్కువ గంటలు స్టూడియోలోనే ఉండిపోతున్నాను.







అందుకు ఎంతో ఆనందంగా ఉన్నాను. నేను ఓ స్టూడియో ఓనర్ అనేకంటే నా స్టూడియోలో నిరంతరం పనిచేసే ఒక శ్రామికురాలిని అని చెప్పుకోవడానికే ఇష్టపడతాను. స్టూడియో అంటే పెద్దదేమీ కాదు ఒక గది. అయితే, బయట పచ్చదనం ఉంటుంది. నాదైన ఈ ప్రపంచంలో అందమైన సిరామిక్స్, గ్లాస్ డిజైన్స్ రూపొందిస్తుంటాను.

మాస్టర్స్ పూర్తి చేసిన తర్వాత ఏడేళ్లుగా ఈ తయారీని చేపడుతూనే ఉన్నాను. నిజానికి ఇది ప్రతిరోజూ ఒక కొత్త పాఠమే. నా స్టూడియోలో గడిపే ప్రతి క్షణం ఎంతో విలువైనది.

యజ్ఞంలా .. కళారూపాలు

సిరామిక్స్ అండ్ గ్లాస్ డిజైనింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశాక కొన్ని కంపెనీలలో వర్క్ చేశాను. ఏడేళ్లపాటు వివిధ కంపెనీలలో చేసిన ఉద్యోగాలు నాకు అంతగా సంతృప్తినివ్వలేదు. దీంతో ఉద్యోగంలో సంపాదించిన కొద్ది మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ఇంటి దగ్గరే 'కొసావో' పేరుతో ఓ స్టూడియోను ఏర్పాటు చేశాను. ఇప్పుడు ఇదే నాకు జీవనాధారం అయ్యింది. కళాకారిణి నుంచి వ్యవస్థాపకురాలిగా ఎదగడం, నేర్చుకోవడం ... నా ప్రయాణం ఇలాగే కొనసాగించాలనుకుంటున్నాను. ఐదేళ్లుగా ఈ పని ఓ యజ్ఞంలా కొనసాగుతూనే ఉంది. కళారూపాల సృష్టిలోనే కాదు ఇతరులకు బోధించడంలోనూ ఆనందాన్ని, ఆదాయాన్నీ పొందుతున్నాను. అందుకే నా స్టూడియోలో ప్రతిరోజూ అన్ని సీజన్లలోనూ క్లాసులు ఉంటూనే ఉంటాయి. 'ఐదేళ్ల కిందటి వరకు మీరెక్కడ ఉంటారో మాకు తెలియదు, ఇప్పుడు ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు' అని క్లాసులకు వచ్చినవారు అంటుంటే చిరునవ్వే నా సమాధానంగా ఉంటుంది.







దేనికదే ప్రత్యేకం..

బయట మనకు ఎన్నో రకాల మిషన్ మేడ్ కళారూపాలు లభించవచ్చు. కానీ, వాటిలో ఒక ఆత్మ అంటూ ఉండదు. ఈ కళను ఏ డిజిటల్ పరికరాలతోనూ భర్తీ చేయలేం. వీటి తయారీలో ఓర్పు, పట్టుదల అవసరం. అందుకు మంచి ప్రతిఫలం కూడా లభిస్తుంది. ఉద్యోగంలో మరొకరి కోసం పనిచేస్తున్నప్పుడు మనకు పరిమితులు ఉంటాయి. సొంతంగా ఏదైనా ప్రారంభించాలంటే అందులో నైపుణ్యం అవసరం. వివిధచోట్ల పనిచేసిన అనుభవం కూడా నాకు చాలా సహాయపడింది. అలాగే, విభిన్న వ్యక్తుల నుంచి వారి ప్రవర్తనల నుండి రకరకాల పద్ధతులు, మార్గాలను అర్థం చేసుకోగలిగాను. ఇవన్నీ నన్ను నేను కొత్తగా మలుచుకోవడానికి సహాయపడ్డాయి.

వస్తువుల తయారీని ఫొటోలుగా తీసి, వాటిని ఆన్‌లైన్ ద్వారా కస్టమర్లకు షేర్ చేస్తుంటాను. ఆ తర్వాత రకరకాల పద్ధతుల్లో అనుకున్న రూపానికి తీసుకువస్తాను. ముఖ్యంగా పాత సినిమాలు, డైలాగ్‌ల నుండి ప్రేరణ పొందిన థీమ్‌లతోనూ వస్తువుల తయారీకి ప్లాన్ చేస్తుంటాను. ఇవి చాలామందిని ఆకట్టుకుంటున్నాయి. సిరామిక్ అండ్ గ్లాస్ డిజైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను' అని వివరిస్తుంది రోసా శ్రుతి.

విజయపథం

'మోనా'ర్క్

* ఆత్మవిశ్వాసమే రాజసం
* సాధారణ స్థాయి నుంచి బిలియనీర్ వరకు

వరల్డ్స్ మోస్ట్ ప్రిస్టీజియస్, గ్లామరస్ ఫ్యాషన్ ఈవెంట్
'మెట్ గాలా–2024'లో బ్రేక్‌ఔట్ స్టార్‌గా
అందరి దృష్టిని ఆకర్షించింది మోనా పటేల్.
'ఎవరీ మోనా?' అని సెర్చ్ చేసేలా చేసింది.
వడోదర నుంచి అమెరికా వరకు ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా
మోనా ఎదిగిన వైనం స్ఫూర్తిదాయకం.
ఫిలాంత్రపిస్ట్‌గా ఎన్నో రకాల సేవాకార్యక్రమాలు చేపడుతోంది...



మోడల్‌గా మోనా పటేల్

గుజరాత్‌లోని వడోదరలో పుట్టి పెరిగిన మోనా పటేల్ చాలామంది అమ్మాయిలలాగే స్కూల్, కాలేజీ రోజుల్లో రకరకాల వివక్షలు, సవాళ్లు ఎదుర్కొంది. 'ఆటలు మగవారి కోసమే','ఆడవారు ఇంట్లోనే క్షేమంగా ఉంటారు' 'లక్ష్యాలు అనేవి మగవారి కోసమే' ఇలాంటి ఎన్నో పురుషాధిక్య భావజాల ధోరణులకు సంబంధించిన మాటలు విన్నది మోనా.

అయితే అలాంటి మాటలకు ఎప్పుడూ విలువ ఇవ్వలేదు.

సవాలుకు సై అనడం తప్ప వెనక్కి తిరిగి చూసింది లేదు.

పన్నెండు సంవత్సరాల వయసు నుంచి బాయ్స్-స్టైల్ హెయిర్ కట్‌తో కనిపించడం ప్రారంభించింది. వస్త్రధారణ కూడా అచ్చం అబ్బాయిలలాగే ఉండేది.

'ఏమిటీ వేషం'లాంటి వెక్కిరింపులకు ముఖం మీదే సమాధానం చెప్పి నోరు మూయించేది.

'హెయిర్ కట్ అనేది రెబిలియన్ యాక్ట్. సెల్ఫ్-ఎంపవర్‌మెంట్‌కు సింబల్' అంటూ ఆనాటి రోజులను గుర్తు చేసుకుంటుంది మోనా.

ఇంటి నుంచి బయటి వెళ్లడమే సాహసంగా భావించే రోజుల నుంచి చదువు కోసం గుజరాత్ యూనివర్శిటీలో అడుగు పెట్టింది. హోమ్ టౌన్ తప్ప మరో టౌన్ తెలియని మోనా పైచదువుల కోసం న్యూజెర్సీలోని రాత్‌గర్స్ యూనివర్శిటీకి వెళ్లింది.

'ఔట్‌సైడ్ ఇండియా లైఫ్ గురించి ఎప్పటి నుంచో ఆసక్తి ఉండేది. చదువుల రూపంలో అది నెరవేరింది. ఒంటరిగా బయలుదేరినప్పటికీ ఆ ఒంటరితనమే ధైర్యాన్ని ఇచ్చింది. కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది' అంటుంది మోనా.

అమెరికాకు వెళ్లిన కొత్తలో అక్కడి వేషధారణ, ఆచార వ్యవహారాలు తనకు కొత్తగా అనిపించేవి.

'ఈ ప్రపంచంలో నేను ఇమడగలనా!' అని కూడా సందేహించేది.

అయితే ఆ ప్రపంచంలోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయధ్వజం ఎగరేసింది మోనా పటేల్.

ఒక్కో మెట్టు ఎక్కుతూ హెల్త్‌కేర్, టెక్, రియల్ ఎస్టేట్... మొదలైన రంగాలలో ఎనిమిది కంపెనీలను నెలకొల్పింది.

వ్యాపార విజయాలే కాదు సామాజిక సేవాకార్యక్రమాలు కూడా మోనాకు ఇష్టం. జెండర్ ఈక్వాలిటీ, అమ్మాయిల చదువు, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను దృష్టిలో పెట్టుకొని 'కొచర్ ఫర్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

'మూడు పెద్ద సూట్‌కేస్‌లతో తొలిసారిగా ఇండియా నుంచి డల్లాస్‌కు బయలుదేరాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మోనా.

ఆ సూటుకేసులలో విలువైన వస్తువులు ఉండచ్చు. అయితే వాటి అన్నిటికంటే అత్యంత విలువైనది... ఆమెలోని ఆత్మవిశ్వాసం. ఆ ఆత్మవిశ్వాసమే మోనా పటేల్‌ను తిరుగులేని ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది. ఎంతోమందికి స్ఫూర్తి ఇచ్చేలా చేస్తోంది.

బంగారు రెక్కల సీతాకోకచిలుక

ప్రతిష్ఠాత్మకమైన మెట్‌గాలా 2024 ఎడిషన్‌ను న్యూయార్క్‌లోని 'మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్'లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెన్నిఫర్ లోపెజ్, సారా జెస్సికా, ఆలియా భట్, ఇషా అంబానీ, నటాషా పూనావాలా... మొదలైన ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు. మెట్ గాలా రెడ్ కార్పెట్‌పై కనిపించాలనేది ఎంతోమంది అమ్మాయిల కల. అయితే తొలి ప్రయత్నంలోనే ప్రేక్షకులు 'వావ్' అనుకునేలా చేసి, మెట్ గాలాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పటేల్. 'ది గార్డెన్ ఆఫ్ టైమ్' థీమ్‌తో రూపొందించిన సీతాకోకచిలుక ఆకారంలో ఉన్న గౌనుకు ఎంతోమంది ఫిదా అయ్యారు. 'నా వారసత్వాన్ని సెలబ్రేట్ చేసుకునేలా నా డెబ్యూ లుక్ ఉండాలనుకున్నాను' అంటుంది పటేల్. రెడ్ కార్పెట్‌పై పటేల్ బ్యూటీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ సెన్సేషన్‌గా మారింది.

బ్యూటిప్స్

కనురెప్పల సోయగం...

- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్‌తో కళ్లను మీనాల్లా మెరిపించవచ్చని తెలిసినాకూడా వాటిని ఎలా అమర్చుకోవాలో అర్థం కాక ఇబ్బంది పడుతుంటే... ఒకసారి ఇలా ట్రై చేయండి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ (సౌందర్య సాధనాల మార్కెట్‌లో దొరుకుతాయి) ఒక సెట్, వాటిని అమర్చడానికి ఐలాష్ గ్లూ తీసుకోవాలి. వీటితోపాటు కత్తెర, ట్వీజర్, ఐ లాష్ కర్లర్, ఐ లైనర్, మస్కారా తీసుకోవాలి.
- ఆర్టిఫీషియల్ ఐ లాషెస్ మరీ పొడవుగా ఉన్నట్లనిపిస్తే తగినంత మేర ట్రిమ్ చేయాలి.
- ట్వీజర్ సహాయంతో లాషెస్‌కు గ్లూ పట్టించాలి. ఇప్పుడు వాటిని జాగ్రత్తగా కనురెప్ప మీద అమర్చాలి. గ్లూ ఆరి లాషెస్ సెట్ అయ్యే వరకు ఆగాలి. స్కిన్‌కు అంటుకోకుండా గ్లూవిడిగా ఆరిపోతున్నట్లు అనిపించినా, ఆరాక ఊడి వచ్చేటట్లు అనిపించినా కనురెప్పల మీద ఆర్టిఫీషియల్ లాషెస్ కరెక్ట్‌గా సెట్ అయ్యేటట్లు మెల్లగా నొక్కాలి.



- గ్లూ ఆరిన తర్వాత లాషెస్‌కు డార్క్‌షేడ్ ఐ లైనర్ అప్లయ్ చేయాలి. ఇలా చేయడం వల్ల అసలు కనురెప్పలకు, ఆర్టిఫీషియల్ లాషెస్‌కు మధ్య తేడా కనిపించకుండా అంతా ఒకేలా ఉంటాయి.
- చివరగా ఐలాష్ కర్లర్‌తో వంపు తిప్పాలి. అవసరమనిపిస్తే (మరింతడార్క్‌గా కనిపించాలనుకుంటే) మస్కారా అప్లయ్ చేయాలి.

కోమలమైన పెదవుల కోసం...

- రోజూ ఉదయాన్నే బ్రష్ చేసిన తరువాత.. బ్రష్ మీద కొద్దిగా తేనె వేసి రెండు పెదవులపైన గుండ్రంగా ఐదు నిమిషాలపాటు రుద్దాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదవులపై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోతాయి. మర్దన వల్ల రక్తప్రసరణ సక్రమంగా జరిగి పెదవులు మృదువుగా మారతాయి.



- ఉదయం బ్రష్‌తో మర్దన చేసాక, రాత్రి పడుకునేముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా రాయాలి. ఇందుకోసం.. కొద్దిగా బీట్‌రూట్ రసాన్ని వేడి చేయాలి. వేడిచేసిన రసంలో అర టీస్పూను కార్న్‌ఫ్లోర్ వేసి ఐదు నిమిషాలపాటు బాగా కలిపి దించేయాలి. తరువాత ఈ మిశ్రమంలో అర టీస్పూను గ్లిజరిన్, పావు టీస్పూను కొబ్బరి నూనె కలిపి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వచేయాలి. ఈ మిశ్రమం గట్టిపడిన తరువాత పెదవులకు రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయం నీటితో కడిగేయాలి
- ఈ రెండింటిని ఒకదాని తరువాత ఒకటి క్రమం తప్పకుండా పాటిస్తే పెదవులు గులాబి రేకుల్లా కోమలంగా పింక్ కలర్‌లో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

క్లుప్తంగా...

అక్రమ నిర్మాణాల తొలగింపులో లోకాయుక్త జోక్యం చేసుకోలేదు

- తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: అక్రమ నిర్మాణాల తొలగింపులో జోక్యం చేసుకునే అధికారం లోకాయుక్తకు లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. అంతకుముందు లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. లోకాయుక్త చట్టం 1983లోని సెక్షన్ 29(ఏ)..అక్రమ నిర్మాణాల తొలగింపునకు సంబంధించి చర్యలు తీసుకునే, జోక్యం చేసుకునే అధికారం ఇవ్వలేదని ఓ కేసు విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. నిర్మాణాలను తొలగించాలంటూ 2015లో లోకాయుక్త జారీ చేసిన ఆదేశాలను హైదరాబాద్‌కు చెందిన హనుమంతరావు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టి తీర్పునిచ్చింది. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలు చెల్లవని నొక్కిచెప్పింది.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్‌గా కవిత తొలగింపు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ కమిషనర్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు.. ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కవితపై పలు అభియోగాల ఆధారంగా ఈ నెల 3 నుంచి ఆమెను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. 2021లో పదవీ బాధ్యతలు చేపట్టిన కవిత ఏప్రిల్ 2026 వరకు కొనసాగాల్సి ఉండగా మధ్యలోనే తప్పించారు.

10న నాలుగు వేల డప్పులతో ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ రక్షణ పేరుతో ఈనెల 10న సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు నాలుగు వేల డప్పులతో ర్యాలీ ఉంటుందని కాంగ్రెస్ నేతలు గజ్జెల కాంతం, సతీశ్‌మాదిగ తెలిపారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని చెప్పారు. బీజేపీకి 400 సీట్లు ఇస్తే దేశాన్ని మోదీ రాజ్యంగా మార్చుతారని ఆరోపించారు. రాజ్యాంగం, రిజర్వేషన్లను కాపాడేది కాంగ్రెస్ ఒక్కటేనని ఆయన స్పష్టం చేశారు.

గోడ కూలి ఏడుగురు దుర్మరణం

హైదరాబాద్ బాచుపల్లిలో విషాదం ... మృతులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందినవారిగా గుర్తింపు



ప్రమాదం జరిగిన ప్రాంతం



కూలిన గోడ

నిజాంపేట్ (హైదరాబాద్): ఓ నిర్మాణ సంస్థ నిర్లక్ష్యానికి ఏడుగురు కూలీల జీవితాలు గాల్లో కలిసిపోయాయి. అపార్ట్‌మెంట్ చుట్టూ నిర్మించిన రిటైనింగ్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలి పక్కనే ఉన్న రేకుల షెడ్లపై పడటంతో, వాటిల్లో నివాసం ఉంటున్న కూలీల కుటుంబాలకు చెందిన ఏడుగురు మృతి చెందారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ శివారు బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో మంగళవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. అయితే రాత్రి వరకు ఒక మృతదేహమే బయటపడింది. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము వరకు వర్షంలోనే సహాయక చర్యలు కొనసాగించిన అధికారులు శిథిలాల నుంచి మొత్తం ఏడు మృతదేహాలను వెలికితీశారు. మృతులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు చెందినవారని తెలిసింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

జోరు వానలో హాహాకారాలు

బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీ సర్వే నంబర్ 345 పీ, 406 పీ, 403ల్లోని 4,232 గజాల విస్తీర్ణంలో రైజ్ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు. అపార్ట్‌మెంట్ చుట్టూ నిర్మించిన రిటైనింగ్ వాల్ ఆనుకుని ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లలో కూలీల కుటుంబాలు నివసిస్తున్నాయి. మంగళవారం సాయంత్రం జోరున వాన కురుస్తుండగా.. సుమారు 6 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ గోడ కూలిపోయింది. రేకుల షెడ్లలో ఉన్నవారు గోడ శిథిలాల కింద చిక్కుకుపోవడంతో ఆ ప్రాంతం అరుపులు, కేకలతో దద్దరిల్లిపోయింది. సమాచారం అందుకున్న బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ ఉపేందర్.. ఎస్‌ఐలు సత్యనారాయణ, మహేశ్, సంధ్య ఇతర సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దంపతులు రామ్‌యాదవ్ (44), గీతా బాల్ (40), వారి కుమారుడు హిమాన్షు (4), మహారాష్ట్రకు చెందిన దంపతులు బిద్రేష్ (30), ఖుషి (20), అదే రాష్ట్రానికి చెందిన శంకట్‌గౌడ్ (18), శ్రీపా మాజీ (23)ల మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సాగర్ మార్వి, సుపీందర్ దుని, హెడ్మస్, మోతీ, తంగబట్టి, అమీర్ హుస్సేన్, దామ్‌సోమ్రీలకు గాయాలు కాగా స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణారావు, ఆర్డీఓ శ్యాం ప్రసాద్, తహసీల్దార్ పూల్‌సింగ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ. 80 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసినట్లు కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ చతుర్వేది తెలిపారు.

ఎత్తైన గోడ..తక్కువ మందం!

రిటైనింగ్ వాల్ ఎత్తు సుమారు 25 అడుగుల వరకు ఉండగా, వెడల్పు (మందం) చాలా తక్కువగా ఉండటంతో కొన్ని గంటల పాటు కురిసిన భారీ వర్షానికి కూలిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గోడ నిర్మాణంలో నాణ్యత కూడా లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రమాదం నేపథ్యంలో రైజ్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ అరవింద్‌రెడ్డిపై 304 పీ2 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు. అదే విధంగా రైజ్ నిర్మాణ సంస్థకు అనుమతులు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని కోరుతూ హెచ్ఎండీఏకు నోటీసులు జారీ చేశారు.

తాగునీటికి 2.25 టీఎంసీల నీళ్లు

- విడుదల చేసిన కర్ణాటక ప్రభుత్వం
- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్



సాక్షి, హైదరాబాద్: తాగునీటి కోసం కర్ణాటక ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించాయని, 2.25 టీఎంసీల కృష్ణానీటిని మంగళవారం రాత్రి నుంచి విడుదల చేసిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నీటివిడుదల విషయమై తనతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడినట్టు తెలిపారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోయారన్నారు. అయితే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. మిల్లర్లు తరుగు ఎక్కువ తీసుకుంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలా తరుగు తీసేవారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర నిజమే

మోదీతో అదానీ, అంబానీలకు మధ్య ఉన్న సంబంధం దేశ ప్రజలందరికీ తెలుసని ఉత్తమ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై మోదీ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అదానీ, అంబానీలపై తాము చేసే విమర్శలు మోదీకి కనిపించవని, ఆయన చెప్పే పచ్చి అబద్ధాలను ఎన్నికల కమిషన్ చూసీచూడనట్టు వదిలేస్తుందని చెప్పారు. మోదీ, అమిత్ షా ప్రసంగాలు చూస్తుంటే ఓటమి భయం కనిపిస్తుందని, రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుందన్నది నిజమేనని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

కాళేశ్వరంపై వారం రోజుల్లో పూర్తి నివేదిక

కాళేశ్వరంపై వారంరోజుల్లో పూర్తిస్థాయి నివేదిక వస్తుందని ఉత్తమ్ చెప్పారు. 2019లోనే బ్యారేజీలో డ్యామేజ్ కనపడిందని ఎన్‌డీఎస్‌ఏ వారు చెప్పారని, అప్పుడే నీళ్లు తీసి బాగు చేస్తే బాగుండేది వారి నివేదికలో పేర్కొన్నట్టు తెలిపారు. ఇప్పుడు బ్యారేజీలో నీళ్లు ఉంచకూడదని నివేదిక ఇచ్చారని, బ్యారేజీ సేఫ్టీపై గ్యారంటీ లేదని, కొంత సందిగ్ధత ఉందన్నారు. బ్యారేజీకి సంబంధించిన అన్ని టెస్టులు చేస్తున్నారని, వారంరోజుల్లో నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు అందజేయనున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదని, బీజేపీకి పోయినసారి కన్నా తగ్గుతాయని, ఇండియాలోనే కాంగ్రెస్‌కు నల్లగొండలో ఎక్కువ మెజారిటీ వస్తుందని ఉత్తమ్ తెలిపారు.

ఇప్పట్లో మరమ్మతులు కష్టమే!

కాళేశ్వరం బ్యారేజీల విషయంలో సర్కార్ పునరాలోచన

- అయ్యర్ కమిటీ నివేదికపై అధ్యయనానికి ఇంజనీర్లతో మరో కమిటీ వేయాలని నిర్ణయం
- ఆ కమిటీ సూచనల తర్వాతే ముందడుగు
- మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేసినా గ్యారంటీ లేదన్న అయ్యర్ కమిటీ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నిర్వహించాల్సిన అత్యవసర మరమ్మతులను సూచిస్తూ కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ తాజాగా మధ్యంతర నివేదిక సమర్పించినా.. మరమ్మతులు తక్షణమే ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదు. వానాకాలం ప్రారంభానికి నెల రోజులే మిగిలి ఉండగా, ఆలోగా అయ్యర్ కమిటీ సిఫారసు చేసిన తాత్కాలిక మరమ్మతులను పూర్తి చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మేడిగడ్డ బ్యారేజీలోని 7వ నంబర్ బ్లాక్‌కు నిర్వహించే మరమ్మతులు తాత్కాలికమేనని, మళ్లీ ఏదైనా జరగదని గ్యారెంటీ ఇవ్వలేమని అయ్యర్ కమిటీ తేల్చిచెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఈ నేపథ్యంలో కమిటీ నివేదికపై అధ్యయనం కోసం నీటిపారుదల శాఖలోని ఇంజనీర్లతో ఓ కమిటీని వేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీలకు మరమ్మతుల విషయంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. అయ్యర్ కమిటీ చేసిన సిఫారసుల్లో కొన్నింటిని మాత్రమే వానాకాలం ప్రారంభానికి ముందు అమలు చేసేందుకు అవకాశముందని అధికారవర్గాలు తెలిపాయి. కమిటీ సూచించిన పనులకు సంబంధించిన డిజైన్లు, డ్రాయింగ్స్‌ను తయారు చేసి ఆమోదం తీసుకోవడానికి చాలా సమయం పడుతుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆలోగా వర్షాకాలం ప్రారంభం అవుతుందని చెపుతున్నాయి. అయ్యర్ కమిటీ మధ్యంతర నివేదిక సమర్పించిన తర్వాతే బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులను నిర్వహిస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ భవితవ్యంపై అయ్యర్ కమిటీ ప్రశ్నలు రేకెత్తించిన నేపథ్యంలో మరమ్మతులు చేపట్టిన తర్వాత ఏదైనా అనుకోని సంఘటన జరిగితే దానికి బాధ్యత వహించాల్సి వస్తుందనే భావనతో ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. కాగా, మరో వారం రోజులు గడిచిన తర్వాతే మరమ్మతులు చేపట్టే అంశంపై కొంత స్పష్టత వచ్చే అవకాశముందని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

నేటి నుంచి ఇంజనీరింగ్ సెట్

- ముగిసిన అగ్రి, ఫార్మా సెట్
- వర్షంతో విద్యుత్ అంతరాయం
- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు
- అనేక చోట్ల కొద్ది సేపు మొరాయించిన సర్వర్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి జేఎన్‌టీయూహెచ్ నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ఈఏపీ సెట్) బుధవారం ప్రశాంతంగానే ముగిసింది. అయితే, మంగళవారం కురిసిన అకాల వర్షం కారణంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పరీక్ష కేంద్రాల్లో అనేక చోట్ల విద్యుత్ లేకపోవడం, ఇంటర్నెట్ సదుపాయం గంటల తరబడి అందుబాటులోకి రాకపోవడంతో సెట్‌కు సమస్యలు తలెత్తాయి. హైదరాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాల్లో కొద్దిసేపు కంప్యూటర్లు మొరాయించినట్టు విద్యార్థులు తెలిపారు. కానీ తక్షణమే అధికారులు స్పందించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే అదనంగా జనరేటర్లను సిద్ధం చేశారు. నెట్‌వర్క్ సమస్యలను కొన్ని నిమిషాల వ్యవధిలోనే పరిష్కరించినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం మొదలైన ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగానికి చెందిన సెట్ రెండో రోజు కూడా జరిగింది. ఈ రెండు రోజులకు కలిపి 1,00,254 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 90 శాతం విద్యార్థులు పరీక్ష రాసినట్టు అధికారవర్గాలు తెలిపాయి.

ఇంజనీరింగ్ సెట్‌కు పక్కా ఏర్పాట్లు

రాష్ట్రంలోని దాదాపు 175 కాలేజీల్లో ఉన్న 1.06 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి జేఎన్‌టీయూహెచ్ నిర్వహించే సెట్ గురువారం మొదలవుతుంది. ఈ పరీక్షకు ఏపీ, తెలంగాణ నుంచి 2,54,532 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. సగం మందికిపైగా విద్యార్థులు హైదరాబాద్ కేంద్రం నుంచే పరీక్ష రాస్తున్నారు. దీంతో హైదరాబాద్‌లో 4 జోన్లు ఏర్పాటు చేశారు. వర్షం, గాలి దుమారం అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. అన్ని కేంద్రాల్లోనూ జనరేటర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నెట్‌వర్క్ సమస్య రాకుండా కూడా అదనపు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

జిల్లా వార్తలు

ఏకలవ్య విద్యాలయాల్లో ఇంటర్ ప్రవేశాలు

భద్రాచలంటౌన్: తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఎనిమిది ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన కొనసాగనుండగా, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. 2023 – 24 విద్యాసంవత్సరం ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థుల నుంచి ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో బాలికలకు సంబంధించి గండుగులపల్లి, పాల్వంచ, గుండాల, బాలురకు టేకులపల్లి, కోఎడ్యుకేషన్ దుమ్ముగూడెం, చర్ల, ములకలపల్లి, సింగరేణి కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎంచుకున్న ఈఎంఆర్ఎస్ విద్యాలయంలో దరఖాస్తు అందజేయాలని, పదో తరగతిలో సీజీపీఏ, సీబీఎస్ఈ మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పించేలా ఈ నెల 24న చర్ల విద్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందని పీఓ ఓ ప్రకటనలో వెల్లడించారు.

గాలి వీచిందా.. బూడిదమయం



సూరారం గ్రామాన్ని కమ్మేసిన బూడిద

పాల్వంచరూరల్: కాస్త బలమైన గాలి వీస్తే చాలు పాల్వంచ కేటీపీఎస్ యాష్ పాండ్‌లోని బూడిద గ్రామాలను కమ్మేస్తోంది. మంగళవారం గాలిదుమారం రావడంతో మండలంలోని పునుకుల, పుల్లాయిగూడెం, కోడిపుంజుల వాగు, సూరారం గ్రామాలపై బూడిద పేరుకుపోయింది. వారం కిందట కూడా ఇలాగే జరగగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేటీపీఎస్ కర్మాగారంలో విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గు మండించాక వెలువడే బూడిదను చెరువుల్లోకి మళ్లిస్తారు. అయితే, బూడిద నీటిలో కలిసినా కొన్నిరోజులకు ఎండిపోయి గాలి వచ్చినప్పుడు గ్రామాలను కమ్మేస్తుండటంతో ప్రజలు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏటా వేసవిలో ఈ పరిస్థితి ఎదురవుతుండగా శాశ్వత పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎత్తిపోతలు.. ఎదురుచూపులు..

- మారెళ్లపాడు లిఫ్ట్‌కు శంకుస్థాపన చేసి ఏడాది
- అయినా ముందుకు కదలని పనులు
- పూర్తయితే 'సీతారామ'ద్వారా 17 వేల ఎకరాల అదనపు ఆయకట్టు



బీజీ కొత్తూరు పంప్‌హౌస్ సమీపాన ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాంతం

అశ్వాపురం: మండలంలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా 17 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చేపట్టిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులకు మోక్షం కలగడం లేదు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా మండలంలో రైతాంగానికి సాగునీరు అందించేందుకు మండల పరిధి బీజీ కొత్తూరు పంప్‌హౌస్ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు అనుబంధంగా రూ.25 కోట్లతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత ఏడాది 2023 జనవరి 29న శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించినా.. ఆరు నెలల వరకు తట్టెడు మట్టి తీయలేదు. ఇప్పుడు ఏడాది గడిచినా ఎత్తిపోతల పథకం పనులు ముందుకు సాగడం లేదు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూమి పనులు మాత్రమే చేపట్టారు. అయితే, మే, జూన్ రెండు నెలలు మాత్రమే పనులకు అనుకూలంగా ఉండగా.. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో భారీ వర్షాల కారణంగా పనులు చేపట్టే అవకాశముండదు. గత ఏడాది ఖరీఫ్‌కే ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేస్తామని చెప్పినా ఈ ఏడాది ఖరీఫ్‌కు కూడా సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదు. కాగా, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు, చింతలచెరువు, ఎర్రబొక్కలచెరువు, తీగలచెరువులను గోదావరి జలాలతో నింపి మండలంలో 17 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. ఇకనైనా అధికారులు పనులు చేపట్టి వచ్చే ఏడాది ఖరీఫ్ వరకైనా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

తుమ్మల చెరువు రైతుల చిరకాల కోరిక

జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు కింద 10 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు గోదావరి జలాలు తరలించాలన్నది రైతుల చిరకాల కోరిక. ఈ చెరువు ఆధారంగా వేలాది మంది రైతులు, రైతు కూలీలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, వర్షాధార చెరువు కావడంతో వర్షాలు కురిస్తే చెరువు నిండి రెండు పంటలు పండుతాయి. లేకపోతే రైతులు ఇబ్బంది పడాల్సిందే. ఈ నేపథ్యాన చెరువుకు గోదావరి జలాలు తరలించాలని రైతులు ఏళ్లుగా కోరుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్ ద్వారా తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆపై రీడిజైన్‌లో చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంత రైతాంగానికి నీరు అందే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఎమ్మెల్యేలు, మంత్రులకు విన్నవించారు. దీంతో గత ప్రభుత్వం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, పనులకు శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా పనుల్లో పురోగతి లేక.. తమ కోరిక ఎప్పుడు నెరవేరుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

త్వరలోనే పనులు చేపడతాం..

దుమ్ముగూడెం ఆనకట్ట సమీపాన హెడ్ రెగ్యులేటర్ 2.6 కి.మీ. వద్ద సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పనులు జరుగుతున్నాయి. యంత్రాలన్నీ ఆ పనుల వద్దే ఉండడం వల్ల మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనుల్లో ఆలస్యం జరుగుతోంది. త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు చేపడుతాం.

–వెంకటేశ్వరరావు, ఈఈ, నీటిపారుదల శాఖ

ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం


- కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్‌లో భయం
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



మాట్లాడుతున్న అభ్యర్థి కవిత, పక్కన సత్యవతి, రేగా తదితరులు

అశ్వాపురం: ఆరు గ్యారంటీల పేరుతో మాయమాటలు చెబుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని.. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సూచించారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితతో కలిసి అశ్వాపురం మండలం మొండికుంటలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ తీరును పార్టీ శ్రేణులు ఇంటింటికీ వివరించాలని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుపై ప్రజలు ఓటు వేసేలా పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు. కాగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల నిర్వహించిన బస్సు యాత్రతో కాంగ్రెస్ పార్టీలో భయం పుట్టి హామీలపై రోజుకో మాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు ఎన్నా అశోక్‌కుమార్, గద్దల రామకృష్ణ, కొల్లు మల్లారెడ్డి, తాటి పూజిత, కంచుగట్ల వీరభద్రం, ఈదర సత్యనారాయణ, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, చిలకా వెంకటరామయ్య, వీరారెడ్డి, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశానికి బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఏళ్లుగా పార్టీ కోసం ఎంతో కష్టపడిన తాను ఆర్థికంగా నష్టపోయినా సరైన గుర్తింపు దక్కలేదనే భావనతో ఆయన ప్రచారానికి దూరంగా ఉంటున్నారని తెలిసింది.

భగభగ నుంచి ఉపశమనం



నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలతో పాటు మూగజీవాలు సైతం అల్లాడిపోతున్నాయి. దీంతో మేతకు వెళ్లిన సమయాన ఎక్కడ కాస్త చెట్టు నీడ కనిపించినా జీవాలు అక్కడకు చేరుతున్నాయి. అశ్వారావుపేట మండలం వాగొడ్డుగూడెం సమీపాన ఓ చింత చెట్టు కింద మేకల మంద సేద తీరుతున్న దృశ్యమే ఇది.

– అశ్వారావుపేట రూరల్

23 అడుగుల మోటబావే..



- అయినా సమృద్ధిగా లభ్యమవుతున్న నీరు
- రోజుకు 70 ట్యాంకర్లకు పైగా సరఫరాకు అనువుగా జలధార

రోజురోజుకూ ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. కొంతమంది ఐదారు వందల అడుగుల లోతులో బోర్లు వేసినా.. ఇప్పుడు అవి ఎండిపోతుండడంతో జలం కోసం అల్లాడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో కూడా నగరంలోని మమత రోడ్డులో రామచంద్రనగర్‌లో గాడిపర్తి లక్ష్మీనారాయణకు చెందిన 60 సంవత్సరాల నాటి మోట బావిలో ఏ మాత్రం జలం తగ్గలేదు. బావి లోతు కేవలం 23 అడుగుల్లోనే ఉంది. నిత్యం ఆ బావి నీటిని నగరంలోని వివిధ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తీసుకెళ్లి అమ్ముతున్నారు. గత అనేక సంవత్సరాలుగా ట్యాంకర్లకు సరఫరాకు సరిపడా మోట బావి నీరు అందిస్తోందంటే బావిలో ఊట ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్ష్మీనారాయణ తల్లిదండ్రులు వ్యవసాయం చేసినప్పుడు ఆ బావిని తవ్వించగా ఇప్పుడు సాగు భూములన్నీ వెంచర్లుగా మారడంతో వ్యవసాయం చేయడం లేదు. ప్రస్తుతం ఆ బావి నీటిని గృహ అవసరాలతో పాటు కూరగాయలు, పండ్లచెట్లకు వినియోగిస్తున్నారు.

– ఖమ్మంఅర్బన్